మూడో భార్యకి
నాలుగో మొగుడికి
పెళ్ళయితే
ఆ దాంపత్యం
ఎలా వుంటుంది?

శారదా అశోకవర్ధన్ కథ

# అడ్జెస్ట్‌మెంట్!

"ఐ... లవ్ యూ.... నటాషా! ఐ... లవ్... యూ..." ఆమె కౌగిలిలో కరిగి పోతున్నాడు జయంత్!

"ఐ... టూ... డియర్! అతని పెదవులను అందుకుని అతనిలో ఐక్యమయిపోతూన్నంత దగ్గరగా జరుగుతూ అంది నటాషా!

ఇరువురి మధ్యా గాలికి కూడా చోటు లేదు! నాలుగు కళ్ళూ రెండయ్యాయి! రెండు శరీరాలూ ఒకటయ్యాయి! నటాషా మనసు నిండా జయంత్!

జయంత్ మనసులో నటాషా!

వారికి ప్రపంచంలో ఇంకేమీ కనబడ్డంలేదు వారి ప్రతి రూపాలు తప్ప!

ఏమీ వినపడ్డం లేదు వారి శృంగార సంభాషణలు తప్ప!

వరూధిని ఆమె!

ప్రవరాఖ్యుడతడు!

రతీదేవి ఆమె!

మన్మధుడు అతడు!

ప్రకృతి ఆమె!

పురుషుడు అతడు!

సృష్టికి ప్రతి సృష్టి చేసేదీ జీవితానికి పరమార్థాన్ని కలిపించేదీ ఇదే... ఇదే... ప్రేమ! ప్రేమకు పరాకాష్ట అయిన పెళ్ళి రోజు! పెళ్ళికి ప్రాణం పోసే ఈ రోజు ఈ రాత్రి ఒకరికి ఒకరు అర్పితమయ్యే ఈ రోజు ఈ రాత్రి....

ఒకరిలో ఒకరు ఐక్యమయిపోయే ఈ రోజు! ఈ రాత్రి...

'జీవితం ఎంత మధురం!' అంటూ



జీవించడానికి వాంఛ పెరిగిన ఈ రోజు!

జన్మలో మరిచి పోలేని రోజు!'' అంటూంది నటాషా.

''ఆ మాటలు సన్నగా సంగీతంలా వినిపిస్తున్నాయి అతనికి. దాని అర్థం బోధ పడడం లేదు. అసలు అర్థం చేసుకునే స్థితిలో లేడతడు. జయంత్ ఈ లోకంలోనే లేడు.

కళ్ళనిండా చెవులనిండా మనసునిండా

అతనికి కనిపిస్తోంది. వినిపిస్తోంది ఆమె రూపమే!

రసమయ జగత్తుకి రాజులా తేలిపోతున్నాడు.

మబ్బుల్లో ప్రయాణం చేస్తున్నట్టుంది విమానంలో!

నక్షత్రాలను కోసుకుని ఒడిలో దాచుకుంటున్నట్టుంది!

చందమామతో ఆడుకుంటూన్నట్టుం ది!

శివపార్వతుల ఆనంద తాండవ కేళిలో తామూ పాల్గొంటూన్నట్టుంది.

రాధా మాధవుల రాసకేళిలో వసంతం జల్లుకుంటూ పరవసల్లాపాంలో మునిగి తేలుతూన్నట్టుంది వారికి.

ఆ జంటది ఒక అపూర్వ కలయిక!

ఆ కలయిక ఒక విచిత్రమైన వింత!

అతను లక్షాధికారి!

ఆమె కోటీశ్వరురాలు!

అతను సుందరరూపుడు! చిద్విలాస పురుషుడు! స్మిత వదనుడు!

ఆమె సర్వాంగ సుందరి! అపురూప లావణ్యవతి! గాయని! నర్తకీమణి!

ఇరువురికీ అన్నింటిలోనూ సమాన ఉజ్జీ!

"ఐ... లవ్... యూ... ఫర్... ఎవర్" అతని బిగి కౌగిట్లో నలిగి పోతూ ఉక్కిరి బిక్కిరవుతూ అంది నటాషా.

"ఐ... లవ్... యూ... అన్‌టిల్ డెత్!" ఆమె ఊపిరిని తన ఊపిరిగా పీలుస్తూ అన్నాడు జయంత్!

* * *

చీకటిని పీల్చుకుంటూ ఉదయ భానుడు తూర్పు దిశలో దీపం వెలిగించాడు.

నటాషా జయంత్‌లు ఈ లోకంలో కొచ్చారు. ఆ సుందర స్వప్నం లోంచి వాస్తవాన్ని చూస్తున్నారు.

"జయంత్! ఇది నీకు... మూడో పెళ్ళి! నాకు నాలుగో ప్రేమ!" పెద్దగా నవ్వింది నటాషా.

జయంత్ ఉలిక్కి పడ్డాడు.

అతని కళ్ళముందు గతం బండి చక్రంలా గిర్రున తిరిగింది.

తన మొదటి పెళ్ళి గీతతో జరిగింది. అప్పుడు తనకి చదువులేదు. ఉద్యోగంలేదు. ఉన్నదల్లా ఈ అందమే! గీతకి చదువుంది. బి.ఏ పాసైంది. లక్షల ఆస్తుంది. 'టుబాకో' పొగాకు పొలాలకు అధిపతి శోభనాద్రిగారి ఏకైక పుత్రికా రత్నం గీత. తనని వలచి పెళ్ళి చేసుకుంది. తన డబ్బుతో చదివించింది. తండ్రి వ్యాపారంలో వాటా ఇప్పించి డబ్బుతోపాటు హోదాని కల్పించింది. వారి అనురాగానికి చిహ్నంగా తను ఆమెకి ముగ్గురు బంగారంలాంటి బిడ్డలనిచ్చేడు! ఒకమ్మాయి! ఇద్దరబ్బాయిలూ!

అనుకోకుండా తటస్థపడింది వ్యాపారంలో సుంజాల. కన్ను చెదిరే ఆమె అందం, ఊహాకందని ఆమె ఐశ్వర్యం, తన కంపెని షేర్లనే కాదు తనని కొనేసింది. వ్యాపారంలో ఆమెకున్న చాతుర్యానికి ఆశ్చర్యపోయాడతను. అందరూ ఆమెని కోరుకుంటున్నారు! ఆమె తనని కోరుకుంది! ఆనందంలో తేలిపోయాడు

తను!''


వాళ్ళ రహస్య ప్రేమ గీతకి తెలిసింది. జయంత్‌ని అసహ్యించుకుంది! అతనితో తెగ తెంపులు చేసుకుంది. తన బిడ్డలతోటే తనతోటే ఇకముందు అతనితో ఎటువంటి సంబంధమూ లేదంది. 'తలాఖ్... తలాఖ్... తలాఖ్' అని మూడుసార్లు అన్నారో లేదో వారి సంబంధం మూడు నిమిషాల్లో ముక్కలై పోయింది.

జయంత్ మంజులని పెళ్ళి చేసుకున్నాడు. ప్రేమలో మునిగి తేలుతున్నాడు. ఆమె అడుగులకు మడుగులొత్తుతూ సత్యాపతి బిరుదాంకితుడిలా మంజునాథ్ అనిపించుకున్నాడు. వారి అనురాగానికి చిహ్నంగా మంజు కడుపు పండింది! పసిడిబొమ్మలాంటి పసిపాపని చూసుకోడానికి ఆమె తహతహలాడింది! ఆ రోజు రానే వచ్చింది. ఆమె అనురాగాల పంట 'వసంత్' కేరుమని పలకరించాడు. ఆ ఏడుపు విని ఆమె పులకరించింది. వాణ్ణి చూసింది. రెండు చేతులతోటే ఏడుస్తున్న ఆ పసివాణ్ణి అందుకుని గుండెలకి హత్తుకుంది. తనివితీరా ముద్దాడింది! ఇప్పుడు ఆమె రెండు కళ్ళల్లోనూ వాడే! కానీ క్రూర రాక్షసి జ్వరం రూపంలో ఆమెని ఆవహించింది. కాలనాగు ఆమెని కాటేసింది. కన్ను మూసి తెరిచేంతలో మృత్యువు ఆమెని కబళించుకుపోయింది! ఆ పసికందుని చూసి బావురుమన్న జయంత్ దగ్గిరనుంచి తీసుకుపోయారు మంజుల తల్లిదండ్రులు బాబుని!

గీత దూరమయింది, మంజుల వచ్చిపోయింది! జయంత్‌కి ఈ విశాల ప్రపంచంలో ఎవ్వరూ లేరు! అన్నీ వున్నాయి! ఏదీ లేదు!

దేనికీ లోటు లేదు! అంతా శూన్యం!

దిగాలుగా కృంగిపోతున్న జయంత్ జీవితంలో మళ్ళీ తొలకరి తొంగిచూసింది.



నటాషా అతనిని వరించింది. కోటి సుఖాల స్వరంలోకి దారి చూపించింది!

ఆమెతో బతుకుని పంచుకున్నాడు జయంత్!

*　　*　　*

నటాషా మొదటిసారిగా భరత్‌ని ప్రేమించింది, ప్రేమంటే తెలిసీ తెలియని కాలేజీ రోజుల్లోనే!

"భరత్... ఐ... లవ్.. యూ" అంది ఒక రోజున.

"ఐ... టూ" అన్నాడు భరత్.

కలిసి తిరిగారు! కలిసి నడిచారు! కలిసి భోంచేశారు. కబుర్లు చెప్పుకున్నారు! కాని భరత్ పెళ్ళి మాత్రం పెద్దలు కుదిర్చిన కల్పన తోటే చేసుకున్నాడు.

శశి నటాషాని ప్రేమించాడు. ఎన్నో ఉత్తరాలు రాశాడు. ఎన్నో బహుమానాలిచ్చాడు. "నువ్వు లేకపోతే చచ్చిపోతానన్నాడు!" ఆమె అతనిని ప్రేమించలేక పోయింది. అందుకే కొన్నాళ్ళు అతనితో తిరిగింది. కవిసం అదేవాలు ఆ మధుర స్మృతులనే హృదయంలో దాచుకుంటానన్నాడు శశి! ఆ తరువాత ఆమె అతనితో తిరగలేక పోయింది. అతను మాధవిని చేసుకుని తన జీవితంనుంచి తొలగిపోయాడు.

రాజీవ్‌కీ తనకీ పెళ్ళి కుదిర్చారు పెద్దలు! అంతా నిశ్చయమయ్యాక రాజీవ్ తండ్రి అకస్మాత్తుగా గుండె పోటుతో మరణించాడు. శకునం మంచిది కాదని పెళ్ళి రద్దు చేశారు పెద్దలు!

జయంత్ నాలుగోవాడు! తనని కోరుకున్నాడు. తనూ అతణ్ణే కోరుకుంది. బయట అందరికీ చెప్పడానికి అతను సిగ్గుపడ్డాడు. ఆమెకూడా అదోలా ఫీలయింది. గుట్టు చప్పుడు కాకుండా గుళ్ళో పెళ్ళిచేసుకున్నారు.

దేనికీ లోటు లేదు! చచ్చేటంత డబ్బుంది! ఎవరి ఆస్తి వారికే వుంది! ఇద్దరికీ అందం వుంది! వయసుంది! ప్రపంచాన్ని ఎదుర్కొనే శక్తికూడా వుంది!

కానీ లేనిదల్లా ఒక్కటే మనశ్శాంతి!

భరత్, శశి, రాజీవ్‌లు కళ్ళముందు భూతాల్లా కదులుతూ తనని ఎగతాళి చేస్తున్నట్టనిపిస్తుంది నటాషాకి! గీతా కల్పన తనని వెక్కిరిస్తున్నట్టు భయపడతాడు జయంత్!

"జీవితంలో ప్రేమ ఒకసారే పుడుతుంది అన్న మాట ఎంత వరకు నిజం జయంత్! అదే నిజమైతే మన ప్రేమ అబద్ధం" అంది నటాషా.

"గీతా కల్పనా ఎవ్వరూ లేకపోయినా బతక లేననుకున్నాను వాళ్ళతో వున్న ఆ క్షణాల్లో. కానీ బతకడమే కాదు మళ్ళీ ప్రేమించగలిగాను, ఆరాధిస్తున్నాను నిన్ను. ఇప్పుడు నువ్వు లేకపోతే బతకలేను నటాషా" బాధగా అన్నాడు జయంత్!

నటాషా నవ్వింది.

"జీవితంలో మనిషి ఒక్కసారే ప్రేమిస్తే మరి ఇదంతా ఏమిటి? ప్రేమకాదా? కాదా? కాదా?" ఈ ప్రశ్న గుండెని కోసేస్తోంది.

జయంత్ పిచ్చివాడై పోతున్నాడు.

గట్టిగా అరిచాడు పిచ్చివాడిలా ఏది

ప్రేమ? గీతా, మంజుల, నటాషా...?

హృదయాంతరాంతరాల్లో ఎక్కడినుంచో సమాధానం వినిపించింది మౌన గీతంలా.

"ఒక్క గీతదే ప్రేమ. ఏమి లేని నిన్ను నిన్నుగా ప్రేమించింది. చదివించింది. భాగ్యవంతుణ్ణి చేసింది. నీ ప్రేమలో కల్తీ కనిపించగానే నిన్ను దూషించకుండా తాను దూరమయింది! అన్నీ వుండి ఏమీ లేని నిన్ను ప్రేమించింది గీత!"

అన్నీ వున్న నీ వైపు ఆకర్షితురాలయింది మంజుల! అది ప్రేమకాదు ఆకర్షణ! వాంఛ!"

అన్నీ పోగొట్టుకున్న నీతో కలిసింది నటాషా! ఇది అడ్జెస్ట్‌మెంట్!"

అలాగే నటాషాకూడా!

తను మనసారా ప్రేమించింది ఒక్క భరత్‌నే! అతనిని పోగొట్టుకుని నిరాశ చెందింది"

శశి మీద ఆమెకి ప్రేమలేదు జాలి!

రాజీవ్ అంటే అసలు ఏ అభిప్రాయమూ లేదు. కేవలం అదొక ఘటన.

జయంత్ అంటే ఒక పడవలో ప్రయాణం చేస్తున్న ప్రయాణికుడు స్నేహితుడు. ఇరువురిదీ ఒకే రకమైన జీవితం! పంచుకుంటే కలుస్తారు లేకపోతే నథింగ్! అంటే అడ్జెస్ట్‌మెంట్!

"నాకీ జీవితం వొద్దు! భరత్‌కి అన్యాయం చెయ్యలేను. అతడే నా ప్రేమికుడు" అరిచింది నటాషా!

"గీత సర్వస్వం! ఆమెని పోగొట్టుకున్నాను. పిల్లలేమనుకుంటారు. మంజుల కొడుకుకి అమ్మా నాన్నా ఇద్దరూ లేరు. తల్లి తండ్రీ అమ్మమ్మా తాతలే గొడవ లేదు. కానీ గీత దగ్గర పిల్లలు నాన్నేడీ అంటే ఏం చెబుతుంది. నో నా గీతే నాక్కావాలి" కేకలు పెట్టాడు జయంత్!

"ఇప్పుడు టూ లేట్ బాబూ! ఈ అడ్జెస్ట్‌మెంట్ చేసుకోవడానికి ముందే మీరు మీ మనస్సులను అడ్జెస్ట్ చెయ్యవల్సింది! మనస్సు చాలా సున్నితమైన పరికరం ఈ శరీరానికి ఒక్కసారి ఏదయితే రికార్డు చేస్తుందో దాన్ని భద్రంగా దాచుతుంది. ఆ టేపు ఇరేజ్ కాదు! దానిమీద మళ్ళీ మళ్ళీ రికార్డ్ చేస్తే ఇదిగో ఇలాగే వుంటుంది. గజిబిజి శబ్దాలు! అర్థంలేని మాటలు! ఒక్కసారి ప్రేమించినవాడు మళ్ళీ మళ్ళీ ప్రేమించలేడు! ప్రేమించానన్నా అంటే అది అబద్దం! అది అడ్జెస్ట్‌మెంటే అవుతుంది!" అన్నాడు డాక్టర్ చంద్రశేఖర్ ది గ్రేట్ సైకియాటిస్ట్.

జయంత్ గీత దగ్గరికి వెళ్ళిపోయాడు క్షమాపణ చెప్పుకోడానికి!!

నటాషా సోషల్ వర్క్ కార్యక్రమాలు చేబట్టింది మానసికానందం కోసం. ఇద్దరూ అడ్జెస్ట్ అయిపోయారు!! బోలెడంత మనశ్శాంతి.

*
* *